రైతులు 'ఈ ఫార్మర్'గా నమోదు చేసుకోవాలి: ఏఓ

శంషాబాద్ రూరల్: రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలతో ఈ ఫార్మర్‌గా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను కేటాయిస్తారని పేర్కొన్నారు. రైతు ఆధార్ కార్డును అనుసంధానం చేస్తూ రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఈ ఫార్మర్ ఐడీని కేటాయిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు పొందడానికి ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతు తన ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాసు పుస్తకం, ఆధార్‌తో లింకు చేసి ఉన్న ఫోన్ నంబరుతో మండల వ్యవసాయశాఖ కార్యాలయం లేదా మీసేవా కేంద్రంలో సంప్రదించాలని ఏఓ సూచించారు.

సాగు సమస్యలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

శంషాబాద్: రైతుల ముంగిటకే శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కొత్వాల్‌గూడలో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అఖిల భారత సూక్ష్మ పోషకాల విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ సుకృత్, శంకర్లు నేల నాణ్యత పరిరక్షణ, సూక్ష్మ పోషకాల వినియోగం, మందులు, యూరియా వినియోగం, నీటి యాజమాన్య నిర్వహణ సంబంధిత అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేత, విస్తరణ అధికారి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సబితాఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

రాజేంద్రనగర్: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలను రాజేంద్రనగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్‌లో కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులు, చిన్నారులకు అందజేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కార్పొరేటర్ అర్చన ఆధ్వర్యంలో సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఘనంగా సన్మానించి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, జాలిగం చిత్తారి, పోరెడ్డి ధర్మారెడ్డి, పచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ వెస్ట్ జోన్ డివిజన్ పేరు మార్పు

గోల్కొండ: సౌత్ వెస్ట్ జోన్ పరిధిలో కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కావడంతో పోలీస్ డివిజన్ పేరు కూడా మారింది. కొత్తగా టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయింది. దీంతో గతంలో ఉన్న గోల్కొండ డివిజన్ పేరును టోలిచౌకీ డివిజన్‌గా మార్చారు. గతంలో గోల్కొండ డివిజన్ పరిధిలోని గోల్కొండ, లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ ఉండేది. వీటికి ఒక ఏసీపీ ఉండేవారు. అయితే టోలిచౌకీ డివిజన్‌గా పేరు మారడంతో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ పరిధిలో గోల్కొండ, లంగర్‌హౌస్, టోలిచౌకీ పోలీస్ స్టేషన్‌లు ఉంటాయి. ప్రస్తుతం టోలిచౌకీ డివిజన్ ఏసీపీగా సయ్యద్ ఫయాజ్ ఉన్నారు.

టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్‌నాయక్

గోల్కొండ: కొత్తగా ఏర్పాటైన టోలిచౌకీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.రమేష్‌నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. షేక్‌పేట్ డివిజన్ అజీజ్‌బాగ్ కాలనీలోని దుబాయ్ హౌస్‌లో టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయింది. 2007 బ్యాచ్‌కు చెందిన ఎల్.రమేష్‌నాయక్ ఈ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యమిస్తామన్నారు.

శాంతిసరోవర్‌లో 'కిడ్స్ సమ్మర్ క్యాంప్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'కిడ్స్ సమ్మర్ క్యాంప్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9 ఏళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు అవకాశం కల్పిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం కొనసాగుతుంది. 'మైండ్‌ల్యాబ్, సెల్ఫ్ టాక్, క్రియేటివ్ మెడిటేషన్, మెమరీ పవర్, వాల్యూ యాక్టివిటీస్, డిజిటల్ వెల్‌నెస్' వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ఎంతకష్టమో!



రైల్వేకమాన్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న బస్టాప్ .. దానికి ఎదురుగా రహదారిపై మట్టిదిబ్బలు

స్టాపులున్నా.. బస్సులే రావు..!

- ఎండమావిగా బస్సుల రాకపోకలు
- పాత శంషాబాద్ రహదారుల్లో వృథాగా బస్టాప్‌లు
- బస్సుల పునరుద్ధరణకు స్థానికుల డిమాండ్



సిద్ధాంతి రైల్వేగేటు వద్ద నిరుపయోగంగా ఉన్న బస్టాప్

శంషాబాద్: ఆ రహదారుల్లో బస్టాప్‌లు దిష్టిబొమ్మల్లా మారాయి.. పనికిరాకుండా పోతున్న బస్టాప్‌ల ముందు మట్టికుప్పలు సైతం పేరుకుపోతున్నాయి.. బస్సులు సంబంధిత రూట్లలో అసలు బస్టాప్‌లు ఎందుకు వేశారన్నది పెద్ద ప్రశ్నగా మారింది.

పాత శంషాబాద్ రహదారుల్లో...

పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన చౌరస్తాకు వచ్చే రహదారిలో ఓ కాంప్లెక్స్ పక్కనే బస్టాప్ నిర్మాణం చేసి ఏడాదిన్నరకుపైగా కావస్తోంది. సంబంధిత రహదారిలో బస్సులు నడపటం ఆపేసి సుమారు దశాబ్దకాలం దాటుతోంది. అయినా అక్కడ బస్టాప్ ఎందుకు నిర్మించారన్నది ప్రశ్నగా మారింది. ఎలాగో పనికిరాకుండా ఉన్న ఈ బస్టాప్‌కు ఎదురుగా రాకపోకలు సాగించే రోడ్డులో భారీ ఎత్తున మట్టిదిబ్బలున్నా దానిని తొలగించకుండా మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తుండటమూ మరో సమస్యగా మారింది.

- పాత శంషాబాద్‌లోకి వచ్చే మరో రహదారి సిద్ధాంతి రైల్వేగేటు వద్ద కూడా ఓ బస్టాప్ ఏర్పాటు చేశారు. ఈ రహదారి గుండా ఒక్క బస్సు కూడా రాదుపోదు. దీనిని ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేశారన్నది కూడా అర్థం కాకుండా ఉంది. సిద్ధాంతి ప్రధాన రహదారిలో హనుమాన్ దేవాలయానికి సమీపంలో ఓ బస్టాప్ ఏర్పాటు చేసినా అక్కడ బస్సులు ఆగకుండా కొద్ది ముందుకు వెళ్లిన తర్వాత ఆపుతుండటంతో అక్కడా నిరుపయోగంగా మారింది.

బస్సులొస్తున్నా.. షెల్టర్లు లేక...

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా సంబంధిత అధికారుల్లో కనీస స్పందన లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో బస్టాపుల్లో గంటల తరబడి ప్రజలు బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇలా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ప్రయాణికుల తిప్పలు అనేకం. ఎండలు మండిపోతుండటంతో స్టాపుల్లో బస్సుల కోసం ఎదురు చూడలేక ఇతరత్రా వాహనాల ద్వారా వారి గమ్యస్థానాలకు ప్రయాణికులు వెళ్లిపోతున్నారు. బస్టాపులను అత్యాధునిక పద్ధతుల్లో ఏర్పాటు చేస్తాం అన్న మాటలే తప్ప ఆచరణలో మాత్రం పెట్టడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

- సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ పరిధిలో బస్టాపుల్లో షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ స్టాపుల్లోనే నిలబడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు. షెల్టర్లను ఎప్పుడు ఏర్పాటు చేస్తారో అప్పటి వరకు ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కనీసం ప్రజా ప్రతినిధులన్నా పట్టించుకొని బస్‌షెల్టర్ల ఏర్పాటుకు కృషి చేయడం లేదని ప్రయాణికులు కోరుతున్నారు.



చింతల్‌మెట్ బస్టాపులో ఆపిన ఆటోలు

ఈ ప్రాంతాల్లో షెల్టర్లు లేవు...

అత్తాపూర్ నుంచి రాజేంద్రనగర్ వైపు వెళ్లే అత్తాపూర్ చౌరస్తా వద్ద, చింతల్‌మెట్ చౌరస్తా, హసన్‌నగర్, ఎంఎంపహడీ, నౌనంబర్, వాదియామహమద్‌కాలనీ చౌరస్తా, డైరీఫాం చౌరస్తా, సులేమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటి వరకు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయలేదు.

అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా...

స్టాపుల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో పలు ప్రాంతాలు వాహనాల పార్కింగ్‌లకు అడ్డాలుగా మారుతున్నాయి. పలు బస్టాపుల్లో ఆటోలు, లారీలు తదితర వాహనాలను నిలుపుతున్నారు.

- చెత్తాచెదారం ఇతర వ్యర్థాల డంపింగ్ కేంద్రాలుగా తయారవుతున్నాయి. బస్టాపుల్లో పార్కింగ్ చేయకూడదని ఎన్ని సార్లు చెప్పినా వాహనదారులు వినిపించుకోవడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి బస్టాపుల్లో షెల్టర్లను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక్కడ అవసరమున్నా...

ప్రస్తుతం పాత శంషాబాద్ వైపు బస్సుల రాకపోకలు లేక ఏళ్లు గడుస్తున్నాయి. బెంగుళూరు రహదారిలో ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు అవసరమున్నా అక్కడ సరైన స్థలం లేని కారణంగా షెల్టర్ ఏర్పాటు లేదు. దీనికి సమీపంలో ప్రధాన రహదారిపై బస్టాప్ ఏర్పాటు చేయడం అత్యవసరంగా ఉంది. రాళ్లగూడ రహదారివైపు కూడా వివిధ గ్రామాలకు వెళ్లే బస్సులుంటాయి. ఇక్కడ కూడా పలు చోట్ల ఏర్పాటు అవసరమున్నా ఒక్కచోట కూడా ఏర్పాటు చేయలేదు.

బస్సులు నడపాలి...

పాత శంషాబాద్‌లో ప్రభుత్వ బాలబాలికల ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వేలాది మంది విద్యార్థులు ఇప్పటికీ ఆటోలను ఆశ్రయించడంతో పాటు నడకపైనే ఆధారపడుతున్నారు. బస్తీల ప్రజలకు కూడా ఆటోలే దిక్కుగా మారాయి. ఆయా రహదారుల్లో బస్సులను పునరుద్ధరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఎస్ఎస్‌కే సమాజ్ ఎన్నికలకు నోటిఫికేషన్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఎస్‌కే సమాజ్ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. ఎన్నికలను ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. 2025–28వ సంవత్సర కాలపరిమితితో కమిటీ ఎన్నిక కోసం కోసం ఎన్నికలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల అధికారిగా కె.చంద్రశేఖర్, రాజ్‌కుమార్, జ్యోతిలను నియమించారు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం పోటీ చేయదలచిన వారు రాజేంద్రనగర్‌లోని సంఘం కార్యాలయంలో సంప్రదించాన్నారు. మరింత సమాచారం కోసం సంఘం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఎన్నికల అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం



డీసీకి సమ్మె నోటీసు అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు ఆయన సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను కాల రాస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలతో 47 కోట్ల మందికి నష్టం వాటిల్లనున్నదన్నారు. ఏఐటీయూసీ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి టి.ఆనంద్, అధ్యక్షుడు ఎ.సాయిలు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసమే లక్ష్యం



సంస్కార సాధనా వర్గలో పాల్గొన్న విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామంలో బాలబాలికల వ్యక్తిత్వ వికాసం కోసం సంస్కార సాధనా వర్గను శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అకడమిక్ ఇన్‌చార్జి నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో బాలబాలికలకు చక్కటి విద్య, సంస్కారాలను అందించేందుకు విద్యారంగంలో విద్యా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. కేవలం శిశు మందిరాల్లో చదువుతున్న బాలబాలికలకే కాకుండా, సమాజంలోని అందరి బాల బాలికలకు సంస్కారం అందాలన్న లక్ష్యంతో వేసవి సెలవులలో సంస్కార సాధనా వర్గ శ్రీ సరస్వతీ విద్యాపీఠం నిర్వహిస్తుందన్నారు. చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి అవసరమయ్యేలా దేశభక్తుల కథలు, మహాపురుషుల జీవిత చరిత్రలు, సంగీతం, వేద గణితం తదితర విషయాలు నేర్పిస్తారన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని సూచించారు. వీటిని నిత్యం జీవితంలో కూడా అలవాటు చేసుకోవాలని విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు పేర్కొన్నారు. సంస్కార సాధనా వర్గా ప్రారంభ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త వేద ప్రకాష్ అగర్వాల్, చెరువు రాంబాబు, శ్రీ సరస్వతీ విద్యా పీఠం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పరమానంద బన్సల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గున్నాల దరశథరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్ కోరారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు.. అధికారులకు మధ్య మరింత సమన్వయం చేసేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ ప్రాంతంలోని సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు. సోమవారం ప్రజావాణిలో అందజేసిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు అందజేశామన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అందజేసిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ తదితర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా మ్యాన్‌హోళ్ల నిర్వహణ



ఖాజీగల్లీలో ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూత

గోల్కొండ: డ్రైనేజీ పైపులైన్ల నిర్వహణ అధ్వానంగా తయారవుతోంది. కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, లంగర్‌హౌస్, టోలిచౌకీ డివిజన్లలో మ్యాన్‌హోళ్ల మూతలు పూర్తిగా ధ్వంసమై ఏడాది గడుస్తున్నా వాటిని మార్చడం లేదు. కార్వాన్ బాంజావాడి, కార్వాన్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల కారణంగా ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలో సైతం ఇదే దుస్థితి నెలకొని ఉంది. పలు చోట్ల స్థానికులు ప్రమాదాలను నివారించడానికి ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల మూత వద్ద హెచ్చరికగా చెట్టు కొమ్మలు, ఎత్తైన కర్రలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకుండాపోతుంది.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజాసంక్షేమం



గజమాలతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ప్రేమ్‌గౌడ్

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేతో మాజీ జడ్పీటీసీ తన్వీరాజు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే విజయవంతంగా అమలవుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నాయకులు ప్రేమ్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ గజమాలను ఎమ్మెల్యేకు క్రేన్ ద్వారా వేయించి తన అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికొండ: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

శంషాబాద్ రూరల్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు ఆధ్వర్యంలో నాయకులు ఆయన నివాసంలో కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేత కేక్ కట్ చేసి తినిపించారు.

శంషాబాద్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ జన్మదినం సందర్భంగా శంషాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆయన నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు, కె.చంద్రారెడ్డి, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్ భారీ కేక్‌ను కట్ చేయించారు. శాలువాలతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న చంద్రారెడ్డి, వెంకటేష్‌గౌడ్



శుభాకాంక్షలు తెలుపుతున్న అత్తాపూర్ నాయకుడు అమరేందర్

బండ్లగూడలో ఆస్తిపన్ను వసూలుపై ఫోకస్

- 2024-25వ ఆర్థిక సంవత్సరానికి రూ. 21.56 కోట్ల వసూలు
- 2025-26 టార్గెట్ రూ.37.26 కోట్లు
- ఏప్రిల్‌లో 5 శాతం రాయితీతో రూ. 9.72 కోట్ల వసూలు



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ నగరపాలక సంస్థలో ఆస్తిపన్ను వసూలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రోజురోజుకూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో ఆదాయం భారీగానే సమకూరుతోంది. సుదీర్ఘకాలం పాటు ఇంటి పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకూ అధికారులు వెనుకాడటం లేదు.

- 2024–25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అప్పుడు 35,974కు పైగా నివాసాలకు అసెస్‌మెంటు చేశారు. కొంతమంది సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో అపరాధ రుసుముతో కలిపి మొత్తం ఆదాయం రూ. 21,56 కోట్లు వసూలయ్యాయి.
- 2025–26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 37,718 నివాసాలకు అసెస్‌మెంట్ చేశారు. రూ. 37.26 కోట్ల ఆస్తిపన్ను టార్గెట్‌గా నిర్దేశించారు.

అందులోభాగంగా సోమవారం వరకు రూ. 9.72 కోట్లు వసూలయ్యాయి. మిగిలిన రూ. 27.54 కోట్లను 2026 మార్చి నెలాఖరులోగా వసూలు చేసి వంద శాతం టార్గెట్ చేరుకునేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ నుంచి, మీసేవ కేంద్రాల ద్వారా చెల్లించాలని తెలుపుతూ టార్గెట్‌కు చేరుకునేందుకు బిల్ కలెక్టర్‌లు, కార్పొరేషన్ సిబ్బంది కృషి చేస్తున్నారు.

5 శాతం రాయితీ.. రూ. 9.72 కోట్ల వసూలు

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుల కోసం పురపాలక శాఖ ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ పథకానికి మంచి స్పందన వస్తోంది. కొత్త ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నును ఏప్రిల్‌లో చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పించే ప్రక్రియ కొన్నేళ్లుగా పురపాలక శాఖ అమలు చేస్తుంది. అందులో భాగంగా 2025–26వ సంవత్సరానికి 5 శాతం రాయితీని ఉపయోగించుకొన్న ప్రజలు ఏప్రిల్ వరకు రూ. 9.72 కోట్లు చెల్లించటంతో బిల్ కలెక్టర్‌లను కమిషనర్ శరత్‌చంద్ర అభినందించారు.

గతంలో ఆసక్తి చూపని ప్రజానీకం...

ఒకప్పుడు పన్నులు కట్టేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే నగరపాలక సంస్థ ఆవిర్భావంతో నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు అసెస్‌మెంట్ పూర్తి చేయడంతో పాటు ఇంటి నెంబర్లు కేటాయించి పన్నులు విధించారు. ఈ కారణంగా పన్నులు చెల్లించేదుకు ఆసక్తి చూపుతుండటంతో కార్పొరేషన్‌కు ఆదాయం భారీగా పెరుగుతోంది.

చట్టపరమైన చర్యల దిశగా...

కార్పొరేషన్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు ఇంటి పన్ను చెల్లించని వారిపై కార్పొరేషన్ అధికారులు చట్టపరంగా చర్యలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇకనైనా సకాలంలో పన్నులు చెల్లించాలని కోరుతూనే.. మొండి బకాయిదారులపై చర్యలు ఉపక్రమిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



కార్పొరేషన్‌కు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. కార్పొరేషన్‌లోని ప్రజలందరూ పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నా. సకాలంలో పన్నులు చెల్లించేవారికి ఎలాంటి అపరాధ రుసుం ఉండదు. అందరూ సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని గమనించాలి. బండ్లగూడను అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేసేదిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– బచ్చలకూరి శరత్‌చంద్ర, కమిషనర్, బండ్లగూడ జాగీర్